క్లుప్తంగా

నేడు కంటి వైద్య శిబిరం

దుద్యాల్: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. గీతాజ్ఞాన గురుభక్త మండల సహకారంతో సద్గురు బ్రహ్మానంద స్వామి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి, ఎంఎస్ రెడ్డి లయన్స్ క్లబ్ వారిచే జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

శ్రీశైల పుణ్యక్షేత్రానికి తరలిన శివస్వాములు



పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరుతున్న శివస్వాములు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని కస్తూర్‌పల్లి గ్రామంలోని శివాలయంలో ఆదివారం శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగానికి పంచామృతంతో అభిషేకం, శివాష్టోత్తర శతనామావళి, విశేష అలంకరణ, దూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గురుస్వాములు ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడి కట్టుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్లారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్నస్నేహితురాలి భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు తోటి మిత్రులు. కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాల 2004-05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని సువర్ణ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఆమెతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి రూ.58వేల నగదు జమచేశారు. ఆదివారం వారందరూ కలిసి రావిర్యాల గ్రామానికి వెళ్లి ఆమెను పరామర్శించి, నగదు అందించి తాము అండగా ఉంటామని ధైర్యాన్నిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఉపసర్పంచ్ రేవంత్‌రెడ్డి

కందుకూరు: పోటీల్లో పాల్గొనే యువత గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలని అగర్‌మియాగూడ మాజీ ఉప సర్పంచ్ వడ్డేపల్లి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అగర్‌మియాగూడలో ఏర్పాటు చేసిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-8 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత సన్మార్గంలో నడవడానికి క్రీడలో ఎంతో దోహదపడతాయన్నారు. చిన్నతనం నుంచే ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు లిక్కి జంగారెడ్డి, గోసుల కొండల్‌రెడ్డి, అందె ప్రవీణ్‌యాదవ్, షేక్ మున్నా, చింతకింద రవీందర్‌ముదిరాజ్, లిక్కి ప్రశాంత్, ధన్నారం అంజిరెడ్డి, నేరటి మహేందర్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి



ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీ ఫిలింసిటీలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.బుగ్గరాములు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లి, ముకునూర్, రాయపోల్ గ్రామాల ప్రజలకు రామోజీ ఫిలింసిటీలో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో పట్టాలు పంపిణీ చేస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ అండతో ఫిలింసిటీ యాజమాన్యం లబ్ధిదారులను కబ్జాలోకి రాకుండా అడ్డుకుందన్నారు. లబ్ధిదారులకు స్థలాలు ఇప్పించి, అక్కడే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేసే విధంగా పోరాటం చేస్తామన్నారు. లబ్ధిదారులు, సీపీఎం పార్టీ సానుభూతి పరులు అత్యధిక సంఖ్యలో కలెక్టరేట్ ధర్నాకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

మున్సిపాలిటీలో కలపొద్దు!

- ఉపాధి హామీ పనులతోనే మెరుగవుతున్న జీవనం
- పంచాయతీ రద్దయితే ఇబ్బందులే
- ఆందోళనలో కూలీలు
- పట్టించుకోని అధికారులు



మోమిన్‌పేట: మోమిన్‌పేట గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ మిగత ఎనిమిది గ్రామ పంచాయతీలను విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వానికి గత నెల అధికారులు నివేదించారు. మోమిన్‌పేటతో పాటు 8గ్రామ పంచాయతీలు కస్లాబాదు, బూర్గుపల్లి, రావులపల్లి, చంద్రాయన్‌పల్లి, ఎన్కేపల్లి, మొరంగపల్లి, మల్లారెడ్డిగూడెం, గోవిందాపూర్‌లను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ఫైలు సిద్ధంగా ఉంది. కానీ ఈ గ్రామ పంచాయతీలు పూర్తిగా గ్రామీణ నేపథ్యం ఉండటంతో మున్సిపాలిటీ ఏర్పాటును నిరసిస్తున్నారు. ఇక్కడ కూలీలు, రైతు కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులపైనే జీవనం సాగిస్తున్నారు. భూగర్భ జలాలు అంతగా లేకపోవడంతో ఎక్కువగా ఖరీఫ్ పంటలను వర్షాధారంపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. పంటల కోతల అనంతరం వారికి పనుల్లేక పోవడంతో పూర్తిగా ఆరు నెలలు ఉపాధి హామీ పనులపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. మున్సిపాలిటీ ఏర్పాటయితే ఉపాధి పనులు రద్దు కావడంతో మెరుగవుతున్న జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న కమతాలు ఉండటంతో వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే ఉండటం వల్ల ఉపాధి పనులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

9 గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డులు..

9 గ్రామ పంచాయతీలలో 2,357 మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో గత సంవత్సరం 1,536 కుటుంబాలు పనులు చేశారు. దీంతో వారికి రూ.174.93లక్షలు కూలిగా అర్జించారు. ఈ క్రమంలో వారికి ఉపాధి పోతే ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితిలో పల్లెల విలీనాన్ని కానీ, మున్సిపాలిటీ ఏర్పాటును అంగీకరించబోమని వారు చెబుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాజకీయ నాయకుల్లో ఆందోళన

మున్సిపాలిటా? గ్రామ పంచాయతా? అనే విషయంలో రాజకీయ నాయకులు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. దీంతో వారిలో కూడా ఆందోళన పెరుగుతుంది. ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు సన్నద్ధం అవుతున్న వేళ ఎలా ముందుకు పోవాలని ఆయా పార్టీలు ఆలోచనలో పడ్డాయి. ఏది ఏమైనప్పటికీ స్పష్టమైన ఆదేశాలు ప్రభుత్వం నుంచి వస్తే తప్పా రాజకీయ నాయకుల్లో మొదలైన ఆందోళన తొలగిపోతుంది.

ఎలా బతకాలి?



ఆరు నెలలు కుటుంబం మొత్తం ఉపాధి హామీ పనిపైనే ఆధార పడి ఉన్నాం. ఉన్న ఎకరాలో ఖరీఫ్‌లో సాగైన అనంతరం కోతల తర్వాత ఏడాదంతా ఉపాధి కూలీపైనే బతుకు బండి నడుస్తుంది. అలాంటిది మున్సిపాలిటీలో కలిపితే ఉపాధి హామీ పథకం రద్దవుతుంది. దీంతో ఎలా బతకాలి?

– మమత ఉపాధి కూలీ, బూర్గుపల్లి

ఉపాధి పనులే దిక్కు



ఉపాధి పని పైనే జీవనం సాగిస్తున్నాం. మున్సిపాలిటీలో కలిపితే ఉపాధి పనుల్లేక ఇబ్బందులు తప్పవు. ఇక్కడ సాగు నీటి వసతులు లేకపోవడంతో ఖరీఫ్ పంట కోతలనంతరం ఉపాధి పనులే దిక్కు. వచ్చే ఆదాయం పోతే ఎలా జీవనం సాగించేది.

– పులిగారి ఇందిర ఉపాధి కూలీ, మొరంగపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

పరిగి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని జిల్లా నాయకుడు వెంకట్‌రాములు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో రూ.6లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోలేదన్నారు. కాని కాంగ్రెస్ అధికారంలోకొచ్చినప్పటినుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సంవత్సరంలోనే ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాణిక్యం, పెంటారెడ్డి, కృష్ణయ్య, కృష్ణారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సర్వేకు మరో అవకాశం

మున్సిపల్ కమిషనర్ సునీత

షాద్‌నగర్: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొననివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ సునీత తెలిపారు. ప్రభుత్వం ఇటీవల నెలరోజుల పాటు ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిందని, ఈ సర్వేలో పాల్గొననివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. గతంలో సర్వేలో వివరాలు ఇవ్వనివారు ఈ నెల 28తేదీవరకు తమ కుటుంబ వివరాలను పట్టణంలోని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చని లేదా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

మొయినాబాద్ రూరల్: ఇంటింటి సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎంపీడీఓ సంధ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సర్వే చేసిన సమయంలో వివరాలు అందించని వారికి మరో అవకాశం ఇచ్చిందని తెలిపారు. జిల్లాస్థాయిలో ఉండే టోల్‌ఫ్రీ నెంబర్ 040-211111 నంబర్‌ను సంప్రదించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. లేదా ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు అందించాలని, ఈ నెల 28 వరకు అవకాశం ఉందని తెలిపారు.

ప్రజాపాలన సేవా కేంద్రంలో..

మొయినాబాద్: గతంలో సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కాజా మొయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల నమోదుకు ఫిబ్రవరి 28 వరకు ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజాపాలన సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవచ్చని లేదా ప్రభుత్వం అందిస్తున్న టోల్ ఫ్రీ నంబరులో వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మోమిన్‌పేట: పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోమిన్‌పేట: టేకులపల్లి ఉన్నత పాఠశాలలో 2005-06 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన 56మంది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకదగ్గరకు చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారి గురువులు బ్రహ్మాచారి, లీలాకుమారి, సంజీవరావు, రత్నం, వెంకటయ్య, ప్రకాశంలను పూర్వ విద్యార్థులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, పూర్వ విద్యార్థులు కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, దండు రమేష్, పల్లె రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో 2001-2002 పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించుకున్నారు. 23సంవత్సరాల తరువాత ఒకదగ్గరకు చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను, అల్లరిపనులను స్మరించుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో పూర్వవిద్యార్థులతో ఉపాధ్యాయులు

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యం

మొయినాబాద్ రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్న మంగళారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కేతిరెడ్డిపల్లి గ్రామంలోని వెంకట్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. మొయినాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామ నాయకులు వెంకటేశ్, బుర్ర శంకరయ్య, తలారి రాజు, అవినాశ్, కుమ్మరి జనార్దన్, వడ్ల రమేష్, దాహుద్, కృష్ణ, బాల్‌రాజ్, జాంగిర్, చాంద్‌పాషా, విజయ్, శేఖర్, సత్తయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏ ఆపద వచ్చిన అండగా నిలుస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళపల్లికి చెందిన కీలుకత్తి నర్సింహాగౌడ్ కొద్ది రోజులు క్రితం ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం దశదినకర్మను పురస్కరించుకొని నర్సింహాగౌడ్ ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే రంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నర్సింహాగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు దాసు, అశోక్‌గౌడ్, శంకర్, అమృతసాగర్, రవీందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు శివాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం మొదటిరోజు ఆలయంలో గణపతిపూజ, హోమాలు, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు రోజంతా జరిగాయి. ఆలయంలో మూడురోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్ సున్నపు వసంతం, ధర్మకర్త మాణిక్యప్రభు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి ఆలయంలో భజన మండలితో భజన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. హోమంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో కూడా ఆలయం వద్ద ఈ ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న దేవాలయ వార్షికోత్సవం



దేవాలయ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

నందిగామ: మండల పరిధిలోని బండోనిగూడలో మల్లన్న దేవాలయ నాలుగో వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు వివిధ వేషధారణల్లో ఆటాపాటలతో మల్లన్న కథను గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవానికి వచ్చిన అతిథులను ఆలయ కమిటీ నిర్వాహకులు సన్మానించారు. అంతకుముందు గ్రామంలో మల్లన్న బోనాలను ఊరేగించారు. ఊరేగింపులో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, ఒగ్గుకళాకారుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, నాయకులు బుచ్చయ్య, కావలి కృష్ణయ్య, పాండు, పురుషోత్తంరెడ్డి, శేఖర్, సీతారాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్



పూజలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, భక్తులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. మాఘమాసం సంకటహర చతుర్థిని పురస్కరించుకొని ఆదివారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని వినాయకగంజ్‌లో ఉన్న గణపతి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు అగ్గనూరు బస్వం, యుగేందర్, నందకిషోర్, అభిలాశ్, అమరలింగేశ్వర్, ప్రవీణ్, ప్రకాశ్, ఆగీరు కృష్ణయ్య, గజవాడ నర్సింలు, శ్రీధర్, శ్రీకాంత్, వెంకట్‌రెడ్డి, ఆలయ ట్రస్టు సభ్యులు మహావీర్, శంకర్‌లాల్ లాహోటీ, భరత్, అర్చకుడు రాజన్‌పండిత్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: మండల పరిధిలోని మధురాపూర్ గ్రామ పంచాయతీ మంగలిగడ్డ తండాలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు బొమ్ము రంగయ్యగౌడ్ ఈ విరాళానికి సంబంధించిన నగదును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు నక్కల శ్రీశైలం గౌడ్, ఆంజనేయులు, యాదయ్య, శ్రీనివాస్, శివకుమార్, లోక్యా నాయక్, గోపాల్ నాయక్, జైహింద్ నాయక్, రాములు నాయక్, గోపాల్ నాయక్, అంబుదాస్, పాండు నాయక్, వెంకటేశ్ నాయక్, శివ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో రాజకీయం!

- కార్యదర్శుల స్థాన చలనంలో స్థానిక నాయకుల హస్తం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



ఎంపీడీఓ కార్యాలయం

తాండూరు రూరల్: గ్రామాల్లో పని చేస్తున్న ఉద్యోగులపై రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువయ్యాయి. తన మాట వినడంలేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేస్తున్నారు. ఈ బదిలీ వెనకాల స్థానిక నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. అకస్మాత్తుగా కార్యదర్శుల బదిలీలపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో రాజకీయ జోక్యం తగదని కొందరు ప్రశ్నిస్తున్నారు. సర్పంచులు లేకున్నా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలపై లక్షల్లో ఖర్చు పెట్టుకున్నామని ఇప్పటికిప్పుడు బదిలీలు చేస్తే ఎక్కడికి వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

33 గ్రామ పంచాయతీలు..

తాండూరు మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 31మంది పంచాయతీ కార్యదర్శులు రెగ్యూలర్ పంచాయతీ కార్యదర్శులుగా ఉన్నారు. ఇద్దరు గోనూర్, చంద్రవంచ గ్రామ పంచాయతీ కార్యదర్శులు మాత్రం (ఓపీఎస్)అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. 8 నెలల క్రితం మండలంలో 40 శాతం పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. కొందరు అలాగే గ్రామాల్లో కొనసాగుతున్నారు.


అన్న.. నా మాట వినడంలేదు..

ముఖ్యంగా మండలంలోని కోట బాసుపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప అదే గ్రామంలో అధికారపార్టీ నేత మాట వినడం లేదని ఎమ్మెల్యేకు చెప్పి పెద్దేముల్‌కు బదిలీ చేయించారని జోరుగా ప్రచారం జరుగుతుంది. అలాగే చెంగోల్ పంచాయతీ కార్యదర్శి సంతోషిణిని కూడా బదిలీ చేయాలని ఆ గ్రామ యువనేత ఎమ్మెల్యేను కోరడంతో ఆమెను కూడా బషీరాబాద్ మండలానికి బదిలీ చేశారు. రాజకీయ నేతల ఒత్తిళ్లకు సతమతమౌతున్న అల్లాపూర్ కార్యదర్శి వికారాబాద్, నవాబ్‌పేట్ మండలాలకు బదిలీ కోసం డీపీఓకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్ గ్రామ గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావును కూడా బదిలీ చేసేందుకు అధికార పార్టీ నాయకులు పావులు కదుపు తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. బదిలీ అయిన లాలప్ప కార్యదర్శి మళ్లి చెంగోల్ జీపీకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. చిట్టిఘనాపూర్ పంచాయతీ కార్యదర్శి నవీత గోనూర్ గ్రామానికి వెళ్లేందుకు ఇష్టపడం లేదు. ఆమె కూడా వేరేమండలానికి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజాల్లోకి తీసుకెళ్లడంతో రాత్రి, పగలు పని చేసిన కార్యదర్శులను రాజకీయ నేతల మాటలు విని తమను బలిపశువు చేశారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డీఎల్‌పీఓ కూడా బదిలీ

తాండూరు డివిజనల్ డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ విధుల పట్ల నిక్కచ్చిగా వ్యవహరించే స్వభావం కలవాడని ఉద్యోగులు తెలిపారు. యాలాల మండలంలోని ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి విషయంలో అధికార పార్టీ నేత డీఎల్‌పీఓను బెదిరించడంతో అప్పటి నుంచి మెత్తబడినట్లు సమాచారం. నిజాయితీగల డీఎల్‌పీఓను కూడా రాజకీయ ఒత్తిళ్లతో అకస్మాత్తుగా బదిలీ చేశారని ఆరోపణలు వస్తున్నాయి.

నాయకుల జోక్యం లేదు



తాండూరు మండలంలో పలువురు పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో ఎలాంటి రాజకీయ జోక్యం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా కొందరిని ప్రభుత్వం బదిలీ చేసింది. సోమవారం ఆర్డర్ కాపీలు వస్తాయి. బదిలీలు డీపీఓ స్థాయిలో నిర్వహిస్తారు.

– విశ్వప్రసాద్, ఎంపీడీఓ, తాండూరు మండలం